ప్రపంచమంతా హిందుత్వంవైపు చూస్తోంది


నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: మతోన్మాదంతో దాడులు, అమాయక ప్రజలను బలిగొంటున్న ఘటనలు పెరుగుతున్నాయని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గురువారం విజయదశమి ఉత్సవం, పథసంచలన్ నిర్వహించారు. స్వయం సేవకులంతా చేపట్టిన ఈ యాత్ర ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రధాన వీధులగుండా సాగింది. పలు కూడళ్లలో మహిళలు వీరికి ఘనస్వాగతం పలికారు. పూలవర్షం కురిపించారు. ప్రపంచం అంతా హిందుత్వం వైపు చూస్తోందన్నారు. విదేశీ కంపెనీల ప్రతినిధులు, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు మన ఆచార, వ్యవహారాలను ఆచరిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు ఒకే శాఖతో ఉండగా ఇప్పుడు 75 వేలకు పైచిలుకు శాఖలుగా విస్తరించిందని గుర్తు చేశారు. అనంతరం మినీస్టేడియంలో ఆయుధ పూజ, ధ్వజారోహణ చేపట్టారు. నగర సంఘ్‌చాలక్ తుమ్మల ప్రమోద్‌చంద్రారెడ్డి, పడిగెల కృష్ణసంతోశ్, జిల్లా సంఘ్‌చాలక్ నూకల విజయ్‌కుమార్, స్వయం సేవకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యవాహ రమేశ్


పథసంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

అడవి బిడ్డ నినాదం.. అభివృద్ధి విధానం

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఆసిఫాబాద్: జల్.. జంగల్.. జమీన్ నినాదమే లక్ష్యంగా పోరు సాగించిన కుమురంభీం వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. రాజకీయాలకతీతంగా మంత్రి సీతక్క సహా కాంగ్రెస్, భాజపా, భారాస ప్రజాప్రతినిధులు దర్బార్‌లో కలిసి పాల్గొనటం కొత్త ఒరవడికి కేంద్ర బిందువుగా నిలిచింది. మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహా వివిధ సంఘాల బాధ్యులు ప్రసంగించారు. ఆదివాసీల జీవన విధానం, అభ్యున్నతి, పోడుభూమి సమస్య పరిష్కార కోసం కృతనిశ్చయంతో పనిచేయాలని, ఏజెన్సీలో రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం సహా మౌలిక వసతులు కల్పించాలని, భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సమాలోచనలతో దర్బార్ సాగింది. ఆదివాసీల సంప్రదాయ రీతిలో కుమురంభీం సహా కుమురం




ప్రజా దర్బార్‌లో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, వెడ్మబొజ్జు, మాజీ మంత్రి వేణుగోపాల చారి, భీం మనవడు సోనేరావు, కలెక్టర్, ఐటీడీఏ పీవో, తదితరులు


హాజరైన జనం

● జోడేఘాట్‌లో కుమురంభీంకు ఘన నివాళి

సూరు విగ్రహాలకు నివాళులర్పించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా భీం జీవిత చరిత్రను వెల్లడించేలా సీడీని విడుదల చేసి గోండి భాషలో ప్రసంగించడం ఆదివాసీల్లో ఉత్తేజాన్ని నింపింది. గతేడాదితో పోల్చితే ఈ దఫా జనప్రవాహం కాస్త తగ్గింది.

◆ **ఎంపీ నగేష్ మాట్లాడుతూ..** నాలుగేళ్ల నుంచి ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం జరగడం లేదని వెంటనే నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ. . పుస్తకాల్లో భీం చరిత్ర చదివానని, ఇక్కడ పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. భీం మనవడు సోనేరావు మాట్లాడుతూ.. భీం పోరాటంతోనే గుర్తింపు వచ్చిందన్నారు. కానీ ఆదివాసీలకు మాయ మాటలు చెప్పి తప్పుడు పట్టాలు ఇవ్వకుండా చూడాలన్నారు.

◆ **ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ..** గిరి వికాసం కింద ఆదివాసీ భూముల్లో బోర్లు వేయించాలని, కుమురంభీం కట్ట, వట్టివాగు ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. జైనూర్ ఘటన బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం, కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని, అక్కడ 144 సెక్షన్ ఎత్తివేయాలన్నారు.

◆ **ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ..** బీడు, అటవీ భూముల్లో జీడీ మొక్కల పెంపకంతో ఉపాధి లభిస్తుందన్నారు. దసలిపట్టు సాగు రైతులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, దీన్ని నివారించాలన్నారు.

◆ **ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ** జోడేఘాట్‌కు మధ్యలో అటవీ అనుమతి లేక నిలిచిన 6 కి.మీ. రోడ్డును వచ్చే వర్ధంతి వరకు పూర్తి చేసేలా చూస్తాం

◆ **ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ** 12 పోరు గ్రామాల్లోని 350 మంది ఆదివాసీలకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏల్లో 28 శాఖలు పనిచేయాల్సి ఉండగా కొన్ని మాత్రమే చేస్తున్నాయన్నారు. వీటిని బలోపేతం చేయాలన్నారు.


మొక్కుతున్న కుమురంభీం మనవడు సోనేరావు కుటుంబ సభ్యులు


ఆదివాసీల గుస్సాడీ నృత్యం

భీం పోరాటంతోనే గిరిజన చట్టాలు : మంత్రి సీతక్క

ఆదివాసీల హక్కుల కోసం చేపట్టిన కుమురం భీం పోరాట ఫలితమే గిరిజన చట్టాల రూపకల్పనకు దారి తీసిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీలకు అండగా నిలిచే స్వయం ప్రతిపత్తి కలిగిన ఐటీడీఏలు కొన్ని నిర్వీర్యమైన విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామని, వాటికి నిధులు కేటాయించి జవసత్వాలు తెస్తామన్నారు. కొన్నిచోట్ల అటవీశాఖ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యం చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భీం నెత్తురోడిన ఈ ప్రాంతంలో భూమి ఆక్రమణలు కాకుండా చూడాలని, 12 పోరు గ్రామాల ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం నివేదికలు తయారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడ పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు ఇప్పిస్తామన్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు: తప్పిన ప్రమాదం

కడెం, న్యూస్‌టుడే : మంచిర్యాల నుంచి నిర్మల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు టైరు గురువారం మధ్యాహ్నం కడెం(పెద్దూరు) దాటాక పెద్ద శబ్దంతో పేలిపోయింది. బస్సులో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఒత్తిడికి టైరు పేలి ఉంటుందని భావిస్తున్నారు. ముందు టైరు పేలి ఉంటే ప్రమాదకరంగా ఉండేదని, వెనుక టైరు కావడంతో ఇబ్బంది కలగలేదని అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగినపుడు బస్సులో 85 మంది వరకు ఉన్నారని తెలుస్తోంది. బస్సు టైరును కడెంలో మరమ్మతు చేయించుకుని వెళ్లారు. ఇంత మందిని బస్సుల్లోకి అనుమతించడం ప్రమాదానికి కారణమవుతుందని, ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో బస్సుల సంఖ్య పెంచితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి

నిర్మల్, న్యూస్‌టుడే : రామాయణం రచించి అందరికీ స్ఫూర్తి ప్రదాతగా వాల్మీకి మహర్షి నిలిచారని అదనపు పాలనాధికారి(రెవెన్యూ) కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బోయ కులానికి చెందిన ఆయన అడుగుజాడల్లో ఎంతో మంది రచయితలు, కవులుగా ఎదుగుతున్నారని చెప్పారు. రామాయణం, మహాభారతం సారాంశాలను ఈ తరం విద్యార్థులకు తెలపాలని, ఇలాంటి గొప్ప వారి చరిత్రలను భావితరాలకు అందించాలని సూచించారు. జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, సీపీవో జీవరత్నం, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు పాలనాధికారి(రెవెన్యూ) కిషోర్‌కుమార్

రేపు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

నిర్మల్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు సంబంధించిన అన్ని విద్యాలయాల విద్యార్థులకు కళా ఉత్సవ్- 2024 పోటీలు నిర్మల్‌లోని శాంతినగర్‌లోని జేవీఎన్‌ఆర్ పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్నామని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి తెలిపారు. మొత్తం ఆరు అంశాల్లో గాత్ర, వాయిద్య సంగీతం, బృంద నృత్యం, థియేటర్(సోలో డ్రామా), విజువల్ ఆర్ట్, సంస్కృతి-సంప్రదాయాలపై కథలు చెప్పడంపై వీటిని చేపడుతున్నామని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించి పోటీలకు హాజరయ్యేలా కృషి చేయాలని కోరారు.

మూడంతస్తుల మంచె

రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి రాత్రి, పగలు కాపలా ఉంటారు. పక్షులు, జంతువులను తరమడానికి, కాసింత సేద తీరడానికి మంచెలను తయారు చేసుకుంటారు. ఖానాపూర్ పట్టణ శివారులో ఓ రైతు తన పంట పొలంలో సరికొత్తగా మంచెను తయారు చేసుకున్నారు. తన అవసరాలను బట్టి మూడు అంతస్తుల మంచెను ఇలా ఏర్పాటు చేసుకుని కాపలాగా ఉంటూ తన పంటను రక్షించుకుంటున్నాడు.

-న్యూస్‌టుడే, ఖానాపూర్ గ్రామీణం



ఒర్రెలో శిశువు మృతదేహం లభ్యం

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఒర్రెలో మగ శిశువు మృతదేహం లభించిన విషాద ఘటన గురువారం సారంగాపూర్ మండలం బోరిగాంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలోని ఒర్రెలో అటువైపు వెళ్తున్న వారికి మృత శిశువు కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని సందర్శించి నీటి నుంచి తీయించారు. ఏడు నుంచి ఎనిమిది నెలల వయసు ఉంటుందని, రెండు రోజుల క్రితం నీటిలో పడేసి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతి చెందాక పడేశారా.. లేదా చంపి పడేశారా.. అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. శవ పంచనామా నిమిత్తం నిర్మల్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు.

గాడితప్పిన పాలన..!

● అస్తవ్యస్తంగా బల్దియా నిర్వహణ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:

గ్రామమైనా, పట్టణమైనా.. అధికారులు, పాలకులు సక్రమంగా పనిచేస్తేనే నిర్వహణ సజావుగా సాగుతుంది. లేకపోతే పాలన గాడితప్పుతుంది. సమస్యలు రాజ్యమేలుతాయి. నిర్మల్ పట్టణం దీనికి నిదర్శనంగా మారుతోంది. ఆదాయ వనరులను నిర్లక్ష్యం చేస్తూ, ప్రణాళికలేమితో ఖర్చులు చేస్తూ.. చివరకు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించలేని పరిస్థితిని కొనితెచ్చుకుంటున్నారు. గతంలో ఎన్నడూలేనిరీతిలో ఈ మధ్యకాలంలో కార్మికులు వేతనాల కోసం తరచూ సమ్మె బాట పడుతుండటం పాలకుల వైఫల్యానికి మచ్చుతునక. కేవలం పదినెలల కాలంలో రెండుసార్లు కార్మికులు సమ్మెబాట పట్టడం పరిస్థితికి అద్దం పడుతోంది.


మున్సిపల్ కార్యాలయం

గతంలో తాఖీదులిచ్చినా..

పుర పరిధిలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించకుండా బకాయిపడటంతో గత జనవరిలోనూ సమ్మె చేపట్టారు. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ విషయమై జిల్లా పాలనాధికారి అసంతృప్తి చెందారు. లోపభూయిష్ఠంగా మున్సిపల్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించి అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. జరిగిన దానిపై సమాధానం ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ తాఖీదులు జారీ చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందికి నోటీసులిచ్చి వివరణ కనుక్కోవాలని, సరైన సమాధానం లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ.. క్షేత్రస్థాయిలో పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఇది జరిగి దాదాపు 10 నెలలవుతోంది. మళ్లీ అదేరీతిలో కార్మికులు సమ్మెబాట పట్టడం గమనార్హం. పదిరోజులకు పైగా ఈ ఆందోళన కొనసాగింది. పలు రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు వీరికి మద్దతు తెలిపారు. చివరకు పాలనాధికారి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హామీతో ఆందోళన సద్దుమణిగింది. అది కూడా ఒక నెల వేతనం మాత్రమే చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారు. మిగతా బకాయిలను త్వరలోనే ఇస్తామని భరోసానిచ్చారు. అయినా.. ఇదెంతవరకు సత్ఫలితాలిస్తుందో తెలియని పరిస్థితి. పెండింగ్ బకాయిలు సకాలంలో చెల్లించకపోతే మళ్లీ సమ్మె పోరు తప్పదని కార్మికులు హెచ్చరిస్తుండటం బల్దియా అస్తవ్యస్త పాలనకు అద్దం పడుతోంది.

ఆరోపణలెన్నో..

బల్దియాకు ఆదాయం వస్తున్నా.. అంతకు మించి ఖర్చులు ఉంటున్నాయని పాలకులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వం నుంచి నిధులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో సమస్య తప్పడం లేదంటున్నారు. సమస్యను కావాలని రాజకీయం చేయొద్దంటూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వీటిలో నిజానిజాలను కాసేపు పక్కనపెడితే.. ఆస్తి పన్ను, నల్ల, ట్రేడ్ లైసెన్సు.. ఇలా వివిధ రకాల బిల్లులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిని వేతనాలుగా చెల్లించకుండా కేవలం కొందరు ప్రజాప్రతినిధులు తమ బినామీ గుత్తేదార్లకు ప్రయోజనం కల్పించేందుకు మాత్రమే ఖర్చుపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరి ప్రయోజనం కోసం కార్మికులందరినీ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వాపోతున్నారు. అయితే.. గతంలో మున్సిపల్‌కు సమకూరే ఆదాయాన్ని చాలావరకు కార్మికులు, ఉద్యోగుల జీతభత్యాలకే ఖర్చుచేసేవారని, ఇతర అంశాలకు ప్రతిపాదిస్తే అదనంగా ఉన్న డబ్బునే వినియోగించేవారని పలువురు నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, వేతనాల విషయం పట్టించుకోకుండా బిల్లుల చెల్లింపునకే అధిక ప్రాధాన్యం కల్పిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని ఆరోపిస్తున్నారు.

నాణ్యత పాటించండి.. సమస్యలుంటే తెలపండి : కలెక్టర్

లోకేశ్వరం, న్యూస్‌టుడే: రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ రైతులకు సూచించారు. గురువారం జిల్లా అదనపు పాలనాధికారి కిశోర్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్‌తో కలిసి మండలంలోని అబ్దుల్లాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. శుక్రవారం కేంద్రాలకు గన్నీ బస్తాలు సరఫరా అయ్యేట్లు చర్యలు తీసుకుంటామని, ఈ నెల 20 నుంచి కొనుగోళ్లలో వేగం పెంచుతామన్నారు. అబ్దుల్లాపూర్ గ్రామానికి గ్రామకంఠం గుర్తించకపోవడంతో ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు పాలనాధికారిని కోరారు. రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీఓ వెంకటరమేశ్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కిరణ్‌కుమార్, మేనేజర్ గోపాల్, ఏపీఎం మల్లేశ్‌కుమార్ తదితరులున్నారు.


అబ్దుల్లాపూర్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

నిర్మల్ : జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ఎల్‌ఆర్‌ఎస్‌పై సంబంధితశాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు పరిష్కరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, మండలాలవారీగా పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ఎక్కువ లాగిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగ్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు సి.వి.ఎన్.రాజు, రాజేశ్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

రోడ్డు మరమ్మతులు చేయండి
?: నిర్మల్ మండలం ఎల్లపల్లి నుంచి న్యూపోచంపాడ్‌కు వెళ్లే తారు రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా మారింది. -గంగాధర్, ఎల్లపల్లి గ్రామస్థుడు
✓: ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం -పీఆర్, డీఈఈ తుకారాం, నిర్మల్ డివిజన్
– న్యూస్‌టుడే, నిర్మల్ గ్రామీణం

నిర్లక్ష్యపు నీడలో రైతు వేదికలు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : అన్నదాతలకు సాగులో సూచనలు ఇవ్వడానికి మండలంలోని కొన్ని గ్రామాలకు కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేసి నిర్మించిన రైతువేదికల పరిస్థితి దయనీయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం ప్రారంభించగా.. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

జిల్లాలో 79 క్లస్టర్లలో నిర్మించిన ఈ భవనాల్లో ఏఈవోలు రైతులకు సస్యరక్షణ, చీడపీడల నివారణ వంటి అంశాలపై శిక్షణ అందించేలా ఏర్పాటు చేశారు. ఈ భవనానికి అటెండర్ వంటి సహాయకులను నియమించకపోవడంతో పలు గ్రామాల్లో భవనాల చుట్టూ పిచ్చి మొక్కలతో భయంకరంగా మారాయి.


దిలావర్‌పూర్‌లో నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన రైతు వేదిక

పేరుకుపోతున్న బకాయిలు

ప్రతి నెలా కరెంటు బిల్లు, తాగునీరు, స్వేషనరీ తదితర నిర్వహణకు రూ.9 వేలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు అయిదు నెలల నిర్వహణ ఖర్చులే ప్రభుత్వం పంపిణీ చేసిందని ఇంకా 30 నెలల బకాయిలు ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల రైతులకు సాగు మేలు రకాల పద్ధతులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రొజెక్టర్స్, మానిటర్స్ వచ్చినా.. అనేక భవనాలు ఇప్పటికే శిథిలావస్థకు చెందడంతో మండల అధికారులు అక్కడక్కడా వీటిని ఏర్పాటు చేసి శిక్షణ కొనసాగిస్తున్నారు.

అసౌకర్యాలమయం

అనేక మంది మహిళా ఏఈవో ఉండటంతో కనీసం ఈ భవనాల్లో నీటి సౌకర్యం, మూత్రశాలలు లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ శివారులోని భవనాలు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో ఇటు వైపు సంబంధిత అధికారులు వెళ్లడానికి జంకుతున్నారు.


గుండంపల్లి రైతువేదిక ఆవరణలో మద్యం సీసాలు

జిల్లా ఉన్నతాధికారులకు వివరించాం

అంజి ప్రసాద్, ఏడీఏ

జిల్లాలో రైతు వేదికల నిర్వహణకు సక్రమంగా నిధులు మంజూరు కాకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో భవనానికి ఒక సహాయకుడిని ఏర్పాటు చేస్తే భవనాల నిర్వహణ చేపట్టవచ్చు. ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేయకుండా గ్రామస్థులు చర్యలు తీసుకోవాలి.

సమస్యలు కోకొల్లలు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హస్గుల్ గ్రామాన్ని ప్రభుత్వం ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి డిజిటల్ కార్డు సర్వే ప్రారంభించింది. అయితే సమస్యలు మాత్రం పడకేసి సందర్శకులకు చిరాకు తెప్పించేలా ఉన్నాయి. గ్రామంలోకి ప్రవేశించే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, పొదలతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. రహదారి సైతం గుంతమయంగా, ప్రమాదకర మలుపులతో నరకప్రాయంగా తయారైంది. మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దుర్గంధం నెలకొంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లే రహదారుల దుస్థితి సైతం వెక్కిరిస్తోంది. మురుగు ప్రవహించేందుకు కాల్వలు లేక ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇదే విషయాన్ని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గ్రామాన్ని సందర్శించి ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు పటిష్ఠ చర్యలు చేపడతామన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.


పంట పొలాలకు వెళ్లే రహదారి దుస్థితి

ఆవును కాపాడిన యువకులు

ఖానాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో సదర్మాట్ కాల్వలో ప్రమాదవశాత్తు ఆవు పడింది. ఇరువైపులా కాల్వ కట్ట సిమెంట్ కట్టడం కావడం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఒడ్డుపైకి ఎక్కలేక నీళ్లలో కొట్టుకుపోయింది. గమనించిన స్థానిక యువకులు మాదాసు మురళి, రాజశేఖర్, అక్షయ్ కాల్వలో దూకి ఆవును జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు.

రేషన్‌బియ్యం పంపిణీ చేయడం లేదని నిరసన

ఖానాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని షెట్‌పల్లి రేషన్ దుకాణంలో రెండు నెలల నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని యాపల్‌గూడ, సక్కిగూడెం, రాంనగర్ లబ్ధిదారులు గురువారం దుకాణం ముందు నిరసన వ్యక్తం చేశారు. గతంలో బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడటంతో ఆ సమయంలో డీలర్‌ను కడెంకు బదిలీ చేసి దొందరి డీలర్‌కు అప్పగించారు. ప్రస్తుత డీలర్ సక్రమంగా బియ్యం పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన బాటపట్టారు.


రేషన్ దుకాణం ముందు నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ధరణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జిల్లాలోని తహసీల్దారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలాలవారీగా అన్ని కేటగిరీల దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి, పోర్టల్ గుర్తింపు పత్రాలు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా దరఖాస్తులకు తిరస్కారానికి గురైతే వాటికి సంబంధించిన కారణాలను తెలుపుతూ రికార్డుల విభాగంలో పొందుపరచాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారులు తనిఖీ చేయాలన్నారు. అదనపు పాలనాధికారి(రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీఆర్‌డీవో భుజంగరావు, సీపీవో జీవరత్నం, జిల్లాలోని తహసీల్దారులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

కుంటాల: ఆదాయ వనరులపై దృష్టిసారించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్లూరులో గురువారం లోకేశ్వరం, కుంటాల, కుభీరు, భైంసా మండలాల కార్యదర్శులు, కారోబార్లతో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు, ధ్రువీకరణ పత్రాల జారీ, తడి, పొడి చెత్తతో వర్మీకంపోస్టు తదితరాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. బోరుబావుల్లో సింగిల్ ఫేజ్ మోటార్లు బిగించడం ద్వారా నిర్వహణ, విద్యుత్తు బిల్లు, నీటి వృథా వంటి అనేక రకాల నష్టం వాటిల్లుతుందన్నారు. భైంసా డీఎల్‌పీఓ సుదర్శన్ పటేల్, ఎంపీఓలు సల్మాన్‌రాజ్, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.


కల్లూరులో మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాస్

‘ప్రజాగళం’ సభకు ప్రముఖులకు ఆహ్వానం

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : ఇథనాల్ పరిశ్రమను తరలించాలని శుక్రవారం తలపెట్టిన ‘ప్రజాగళం’ సభకు హైదరాబాద్ నుంచి ప్రముఖులు వస్తున్నారని పరిశ్రమ వ్యతిరేక ఐకాస నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, టీపీజేఏసీ కన్వీనర్ ఆచార్య హరగోపాల్, పర్యావరణవేత్త డా. బాబురావు, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్యతోపాటు కార్మిక సంఘాల నాయకులు వస్తున్నారన్నారు. పరిశ్రమ తరలించాలని దిలావర్‌పూర్‌లో 87 రోజులుగా రైతులు రిలే నిరాహార దీక్ష, 43 రోజులుగా గుండంపల్లిలో నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. రైతులే స్వచ్ఛందంగా చందాలు పోగుచేసి సభ చేపట్టడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

దిలావర్‌పూర్: ‘ప్రజాగళం’ బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల అన్నారు. గురువారం రాత్రి దిలావర్‌పూర్‌లో సభ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. శుక్రవారం నిర్వహించే సభకు అనేక గ్రామాల్లోంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తారని సమాచారం ఉందని ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. భైంసా ఏఎస్పీ అవినాష్, డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ రామకృష్ణ, స్థానిక ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రం సందర్శన

భైంసా, న్యూస్‌టుడే : అనాథ బాలలకు ఏ లోటు లేకుండా చూడాలని బాలల పరిరక్షణ సమితి జిల్లా అధికారులు అన్నారు. గురువారం పట్టణంలోని వివేకానంద ఆవాసాన్ని సందర్శించిన అధికారులు భోజన, వసతి ఏర్పాట్లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న సేవలను చిన్నారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఫిర్దోస్ జబీన్, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు స్వప్న ఆరోగ్య పరీక్షలు చేసి ఉచిత మందులు మాత్రలను అందించారు. బాలల పరిరక్షణ అధికారి దేవి మురిళి, పీవో రాజు, ఆవాసం అధ్యక్షులు శైలేశ్ మాశెట్టివార్ పాల్గొన్నారు.


చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మానవ సంక్షేమంపై అవగాహన

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జీవ సాంకేతిక శాస్త్రం-మానవ సంక్షేమం అనే అంశంపై విద్యార్థులకు ఇచ్చోడ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.వెల్మల మధు అవగాహన కల్పించారు. జీవ శాస్త్రం ద్వారా మానవుల సంక్షేమ ఫలాలు అందుకోవడానికి పుష్కలంగా అవకాశాలున్నాయన్నారు. ప్రిన్సిపల్ సుధాకర్, వృక్షశాస్త్ర అధిపతి ఎస్.పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గంగాధర్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు అందజేయాలి

నిర్మల్ అర్బన్: అంగన్‌వాడీల వేతన బకాయిలు అందజేయాలని నాయకులు అన్నారు. గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మినీ నుంచి ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించినప్పటికీ టీచర్లకు 5 నెలలుగా జీతాలు రావాల్సి ఉన్నాయని పేర్కొన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, ఉపాధ్యక్షురాలు శైలజ, సహాయ కార్యదర్శి వనజ, భాగ్యలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

అధిక మోతాదులో మందులు పిచికారీ చేయవద్దు

లక్ష్మణచాందా: రైతులు పండించే పంటలకు అధిక మోతాదులో మందులు వాడవద్దని ఏడీఏ భాస్కర్ అన్నారు. మండలంలోని న్యాకంజర్ సమీపంలోని రైతుల పంటపొలాలను గురువారం పరిశీలించారు. వరి, మొక్కజొన్న, పసుపు, పత్తి పంటలను చూసి రైతులకు అవగాహన కలిగించారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు సీపీఎం పార్టీ తరఫున పోరాడాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతంకృష్ణ అన్నారు. గురువారం దిలావర్‌పూర్‌లో పార్టీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఉచిత విద్యుత్ అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

ముథోల్, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ముథోల్ వ్యవసాయ పాలిటెక్నిక్, ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ముథోల్ నుంచి లోకేశ్వరం మండలంలోని పంచగుడి వరకు రెండు వరుసల రహదారి మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో బాసర నుంచి శబరి వరకు చేపట్టిన పాదయాత్రను బాసర గోదావరి నది వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రారంభించారు. ముథోల్‌లోని పశువుల ఆసుపత్రిలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసి ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి బలిక్, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్డీవో నారాయణరావు పటేల్ పాల్గొన్నారు.


బాసరలో అయ్యప్ప స్వాముల పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

తానూరు(భైంసా): ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదలకు అండనిస్తోందని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 149 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.1.49 కోట్ల విలువ చేసే చెక్కులను అందించారు. తహసీల్దారు లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, గోప సాయినాథ్, భాజపా మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి పాల్గొన్నారు.


ముథోల్‌లో..


లక్ష్మణచాందా: తహసీల్దార్ కార్యాలయంలో.. తహసీల్దార్ జానకి, అధికారులు


ఖానాపూర్ : బాదనకుర్తిలో..

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

జిల్లావ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. - న్యూస్‌టుడే, బృందం


ఓలాలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ డా.జి.జానకి షర్మిల


దస్తూరాబాద్: దేవునిగూడెం గ్రామంలో...

నేర వార్తలు

పురుగుమందు తాగి ఒకరి ఆత్మహత్య

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో పురుగు మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పేండ్‌పల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. భైంసా గ్రామీణ ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గడ్డ గంగయ్య(40) నిత్యం మద్యం తాగుతూ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతూ ఉండేవాడు. మద్యం మత్తులో భార్యతో తరచూ గొడవపడుతూ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఎప్పటిలాగే ఉదయం మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని పశువుల కొట్టంలో పురుగు మందు తాగి పడిపోయి కనిపించడంతో భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.


నర్సయ్య

మద్యానికి బానిసై ..

కడెం: మండలంలోని అంబారిపేటకు చెందిన బొలిశెట్టి శ్రీనివాస్(34) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసై అతిగా మద్యం తాగడానికి అలవాటుపడ్డాడని, ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై మద్యం తాగడం మానలేకపోతున్నానని మనోవేదనతో బుధవారం రాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడని ఎస్సై పేర్కొన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయ పరిశోధన స్థానం తాత్కాలిక ఉద్యోగి మృతి

ముథోల్, న్యూస్‌టుడే: ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానంలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి భీంరావు(25) గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సైద్‌పూర్ గ్రామానికి చెందిన భీంరావు ముథోల్‌లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎనిమిది నెలల నుంచి తాత్కాలిక ఉద్యోగి(రీసెర్చ్‌ఫెల్లో)గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం అద్దె భవనంపై మృతి చెంది కనిపించాడు. భవనంలో అద్దెకు ఉండే ఇతర వ్యక్తులు గమనించి వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులకు, శాస్త్రవేత్తలకు సమాచారం అందించారు. ఎస్సై సాయికిరణ్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతికిగల కారణాలు తెలుసుకుంటున్నామని, అతడి కుటుంబీకులు వచ్చిన తర్వాత వివరాలు తెలుస్తాయన్నారు. దసరాకు ఇంటికి వెళ్లిన తర్వాత బుధవారం విధులకు హాజరై గురువారం రాలేదని, ఆయన చరవాణికి తోటి ఉద్యోగులు ఫోన్ చేసినా సమాధానం రాలేదన్నారు. సాయంత్రం ఒక్కసారిగా మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న శాస్త్రవేత్తలు, మిగతా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.


భీంరావు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ముథోల్(బాసర): బాసర రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు బాసర రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో నిజామాబాద్ వైపు ఒకటో నంబరు ప్లాంట్‌ఫాం వద్ద లభ్యమైందన్నారు. మృతురాలి వయస్సు(70) ఉందన్నారు. ఆమె దగ్గర ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన తుంగెనోల్ల గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. గంగాధర్ మంగళవారం సాయంత్రం తన ఇంటికి తాళం వేసి భార్యా పిల్లలను తీసుకువచ్చేందుకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామానికి వెళ్లాడు. ఇది గమనించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాను పగలగొట్టి అందులో నుంచి రూ.1.30 లక్షల నగదు, 12 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చాక తాళం పగలగొట్టడంతో పాటు బీరువా తెరిచి ఉండటాన్ని గమనించాడు. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేయించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కారేగాం ఆలయంలో చోరీకి యత్నం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: మండలంలోని కారేగాం ఎల్లమ్మ ఆలయంలో గురువారం సాయంత్రం చోరీకి యత్నించిన దొంగను గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుల కథనం ప్రకారం కారేగాం గ్రామ చివర ఉన్న ఎల్లమ్మ ఆలయంలో సాయంత్రం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చొరబడి ఆలయంలోని హుండీని పగలగొట్టే ప్రయత్నం చేశారు. గమనించిన స్థానికులు గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి ఇద్దరిలో ఒకరు పారిపోగా మరొకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో బాసర పంచాయతీ ఈఓ వీరంగం

● వాకింగ్ చేస్తున్న వ్యక్తిని కారుతో ఢీకొన్న వైనం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర పంచాయతీ ఈఓ గోవింద్‌రాజులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. గురువారం వేకువజామున మద్యం తాగి వేగంగా కారు నడిపి మహారాష్ట్ర సత్రం సమీపంలోని రహదారిపై వాకింగ్ చేస్తున్న బాసర గ్రామానికి చెందిన విజయరావును ఢీకొన్నాడు. ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అయినప్పటికీ కారు ఆపకుండా మద్యం మత్తులో పంచాయతీకి వెళ్లి ఆయన గదిలో కూర్చోన్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, గాయపడిన విజయ్‌రావు, ఆయన బంధువులు అక్కడికి చేరుకుని ప్రశ్నించగా మద్యం మత్తులో వారికి పొంతన లేని సమాధానాలు చెప్పారు. పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం ఈఓ గోవింద్‌రాజులు నిజామాబాద్‌కు వెళ్లిపోయారు. విజయ్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

కుంటాల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు రాంగోపాల్ అన్నారు. మండలంలోని కల్లూరులో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కొద్దిపాటి ప్రీమియం చెల్లిస్తే బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. నగదురహిత లావాదేవీలను అలవర్చుకోవాలని సూచించారు. డీపీఓ శ్రీనివాస్, ఎంపీఓలు సల్మాన్‌రాజ్, మోహన్‌సింగ్, బ్యాంకు మేనేజర్లు మేఘన, సాజిద్ పాల్గొన్నారు.


నిర్మల్ : కుమురం భీం, రాంజీగోండ్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న టీఏజీఎస్ నాయకులు


ముథోల్‌లో..


కుమురంభీం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు

కుమురం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

జిల్లావ్యాప్తంగా కుమురం భీం వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు అన్నారు. నిర్మల్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) జిల్లా కార్యదర్శి తొడసం శంభు కుమురం భీం, రాంజీగోండ్ విగ్రహాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. ఆయన అడుగుజాడల్లో ముందుకెళ్లి న్యాయమైన సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని వెల్లడించారు.
- న్యూస్‌టుడే, బృందం

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి

ఖానాపూర్, న్యూస్‌టుడే: మూడేళ్ల నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కేఎస్ఆర్ డిగ్రీ కళాశాల, ఎస్సార్ డిగ్రీ, ఏఆర్ఎస్, వాగ్దేవి డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్‌లు, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

కుంటాల: డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సంబంధించి పెండింగ్ బోధనా రుసుములను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని టీపీడీపీ ఎంఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బోయి సాయిలు అన్నారు. మండలంలోని కల్లూరు వాసవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గట్టుపల్లి శ్రీనివాస్, సంచాలకుడు జానకీరాం, అధ్యాపకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

నిర్మల్ పట్టణం: మూడేళ్లుగా పెండింగ్‌లోని బోధనా రుసుములను ప్రభుత్వం చెల్లించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) ఉమ్మడి ఆదిలాబాద్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. మిథున్, కిరణ్, బన్నీ, సంతోశ్, సంపత్, సాయి, నందీశ్వర్, సృజన్, షఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణతో ఉపాధ్యాయుల సంక్షేమం

కుభీరు: ఉపాధ్యాయుల హక్కుల సాధన, సంక్షేమం పీఆర్టీయూ తెలంగాణతో సాధ్యమని ఆ సంఘం మండల అధ్యక్షుడు పురంశెట్టి సాయి కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పల్సితండా, రంజని, రంజనితండా, వర్ని, గోడాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వం పాఠశాలల్లో కొత్తగా ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి పీఆర్టీయూ సభ్యత్వం అందించారు. ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘కేసులకు బెదిరేది లేదు’

భైంసా: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని భారాస నియోజకవర్గ సమన్వయ సమితి నాయకులు డా.కిరణ్ కొమ్రేవార్ అన్నారు. గురువారం భైంసాలో మాట్లాడుతూ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.

విధుల్లో చేరిన 42 మంది ఉపాధ్యాయులు

కుభీరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 42 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరి మండల విద్యావనరుల కేంద్రంలో రిపోర్ట్ చేసినట్లు ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. కొత్త ఉపాధ్యాయుల రాకతో ఖాళీలు పూర్తయ్యాయని వివరించారు.

కల్యాణలక్ష్మి ఆర్థికసాయం అందించాలి

నిర్మల్: షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కింద వచ్చే ఆర్థిక సాయాన్ని అందించాలని గురువారం కౌన్సిలర్ ముజాహిద్ అలీ, మాజీ కౌన్సిలర్ రఫీ అహ్మద్‌ఖురేషిలు జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాందా: కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాథోడ్ రాధ అన్నారు. బాబాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో చేపట్టే పనులపై తీర్మానం చేశారు.

డిస్కం అధికారులకు సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూరు విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయంలో బదిలీపై వచ్చిన డిస్కం అధికారులు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సబ్ ఇంజినీర్ మధు, సీనియర్ ఎల్ఐ సాహెబ్‌రావు, ఒక ఎల్ఐ, ఇద్దరు ఎల్ఎంలు విధుల్లో చేరారు. ఆ అధికారులందరిని తోటి సిబ్బంది శాలువాతో సన్మానించారు.

ఎల్లపెల్లిలో బతుకమ్మ సంబురం

నిర్మల్ గ్రామీణం: నిర్మల్ గ్రామీణ మండలం ఎల్లపెల్లిలో గురువారం బతుకమ్మ పండగ నిర్వహించారు. మహిళలు బతుకమ్మలు ఒక దగ్గరకు చేర్చి ముందుగా గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ ఆటలు ఆడి పాడారు. సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.


ఎల్లపెల్లిలో బతుకమ్మ ఆటకు ముందు గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా గ్రామీణం: వాలేగాంలో మిర్జాపూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని దేవేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. డైరెక్టర్లు దీప వెంకట్, రమణరెడ్డి, సెక్రటరీ రాజేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల: కుంటాల ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన 9,10,11,12 తరగతులకు రసాయన శాస్త్రం బోధనకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో ఎమ్మెస్సీ బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిరుపేద కుటుంబాలకు చేయూత

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ చేయుతనందించింది. లక్ష్మణచాంద గ్రామానికి చెందిన చిన్నవ్వ అనే మహిళకు ఇస్త్రీ పెట్టె ఇవ్వగా మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఈటెల శ్రీనివాస్ గురువారం సదరు మహిళ ఇంటికి వెళ్లి అందజేశారు. మాచాపూర్ గ్రామానికి చెందిన గొర్రె మౌనిక కుటుంబానికి రూ.15 వేల విలువ చేసే కుట్టుమిషన్, సామగ్రి అందజేశారు.

ప్రకృతి ఒడి.. చదువులమ్మ బడి



పూలతో కనువిందు చేస్తున్న యాపల్‌గూడ పాఠశాల




ఆకట్టుకుంటున్న బడి తోట



పాఠాలు వింటున్న విద్యార్థులు

ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని చెట్ల నీడ, చల్లటి గాలితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వివిధ రకాల పూలమొక్కలతో పాటు అలంకరణ మొక్కలు పెంచారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంరక్షిస్తున్నారు. కిచెన్ గార్డెన్‌లోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తున్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీపై వివిధ అక్షరాలు, సామెతలు, మహనీయుల చిత్రాలను గీయించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా తయారు చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉంది. రూ.లక్ష ఖర్చుతో వెయ్యి పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఈ బడికి స్వచ్ఛ విద్యాలయం పురస్కారం లభించింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగన్న, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యుల అంకితభావం తోడు కావడంతో ప్రైవేటు పాఠశాలకు దీటుగా చదువు, వసతులతో ఆదర్శంగా నిలుస్తోంది. ఒకప్పుడు 120 మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 310 మందితో ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతోంది. జైనథ్ నుంచి కూడా ఈ పాఠశాలకు చదువుకోవడానికి విద్యార్థులు వస్తున్నారు.

\- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



సొరకాయ @ 4 అడుగులు



సొరకాయ సాధారణంగా ఒక అడుగు లేదా రెండు అడుగుల పొడవు ఉంటుంది. కుమురం భీం జిల్లా కెరమెరికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్ పంట చేనులో నాలుగు అడుగుల పొడవైన సొరకాయ కాసింది. కాయను సదరు రైతు ఇంటికి తీసుకెళ్తుండగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌టుడే, కెరమెరి (జైనూర్)

అడుగులు తడబడి.. ఆగిన ఊపిరి

● నీటి బకెట్‌లో పడి పది నెలల బాలుడి దుర్మరణం



వాంకిడి, న్యూస్‌టుడే: ఇప్పుడిప్పుడే బుడిబుడి అడుగులు వేస్తున్న కుమారుడిని చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులకు.. అవే అడుగులు తీవ్ర గుండెకోతను మిగిల్చాయి. వంశాంకురం పుట్టాడని అల్లారుముద్దుగా పెంచుకుంటున్న అంతలోనే విగతజీవిగా మారేసరికి తల్లడిల్లిపోయారు. పది నెలల వయసులోనే నూరేళ్లు నిండిన కుమారుడి మరణం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. వాంకిడి మండలంలో ఓ చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృత్యువాత పడ్డ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజాపూర్ గ్రామానికి చెందిన చౌదరి గిర్మాజీ-సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు తన్వీర్ (పది నెలల వయసు) ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గిర్మాజీ వ్యవసాయ పనులకు వెళ్లగా సునీత ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో తన్వీర్ ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడిపోయాడు. కుమారుడు కనిపించకపోయేసరికి తల్లి ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూంలోని బకెట్‌లో విగతజీవిగా కనిపించాడు. వెంటనే ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నీటిలో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు.

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ


● కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు లబ్ధి



కోటపల్లి మండలం రాపన్‌పల్లిలో చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

చెన్నూరు గ్రామీణం, ఏసీసీ, న్యూస్‌టుడే : కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు డిసెంబరులో ముగియనుండటంతో ఇటీవల భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం ఈ నెల 9న ఆమోదం తెలపడంతో లక్షలాది మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,60,627 ఆహార భద్రతకార్డులు ఉండగా.. 23,93,693 మంది లబ్ధిదారులు ఉన్నారు. కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు నెలకు అయిదుకిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పొందుతున్నాడు. ప్రభుత్వం ప్రతినెల సుమారు 19,709.60 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది.



ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

ఆహార భద్రత కార్డుదారులకు కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.

ఎలాంటి ఉత్తర్వులు అందలేదు

ఉచిత బియ్యం పంపిణీని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. బియ్యం పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మంచిర్యాల

నీటి పారుదల శాఖకు కొత్తగా 52 మంది ఏఈఈలు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 52 మందిని కేటాయించగా, ఆదిలాబాద్ జిల్లాకు 8, నిర్మల్‌కు 16 మంది, మంచిర్యాలలో 12, కుమురం భీం జిల్లాకు 16 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన ఏఈఈలను జిల్లాల వారీగా కేటాయించడంతో పాటు ఆయా సబ్‌డివిజన్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల వారీగా కొత్తగా ఏఈఈలు రావడంతో నీటి పారుదల శాఖ పరిధిలో పనులు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

చిగురిస్తున్న ఆశలు

● రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు



దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. దున్నడం మొదలు పంట నూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నారు.

✷ వ్యవసాయశాఖపరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

● జిల్లా	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్	కుమురం భీం
● రైతులు (లక్షల్లో)	1.45	1.22	1.54	0.97
● వరిసాగు విస్తీర్ణం	1,80,567	1,984	95,824	58,904
● పత్తి సాగు	1,21,704	3,87,213	1,37,390	2,98,779

యంత్రాలివే..

రాయితీపై అందించే యంత్రాల్లో రోటావేటర్లు, కల్టివేటర్, దమ్ముచక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు రాయితీపై అందనున్నాయి.

తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచారలోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదైమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.



చెట్టు కింద పడి ఉన్న గొర్రెలు, మేకల కళేబరాలు

పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు మృతి

సారంగాపూర్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాసింగ్‌తండా సమీపంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చవాన్ ఇనేష్ అనే రైతు తన గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లాడు. భారీ వర్షం కురవడంతో జీవాలను ఓ చెట్టు కిందకు చేర్చాడు. అదే సమయంలో పిడుగు చెట్టుపై పడటంతో అక్కడ ఉన్న 60 గొర్రెలు, 5 మేకలు మృతి చెందాయి. స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

అమ్మాయిలు.. పతక విజేతలు

● జాతీయస్థాయి కబడ్డీలో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :

ఒకవైపు పేదరికం.. మరోవైపు క్రీడలంటే ఇష్టం.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ బాలికలు రాష్ట్ర, సొసైటీ క్రీడలు, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.. పతకాలు సాధిస్తున్నారు.. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు.. ఆల్‌రౌండర్లుగా గుర్తింపు తెచ్చుకుంటున్న వీరంతా జట్టు గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారు.. క్రీడా విభాగంలో ప్రభుత్వ కొలువులు సాధించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు.



కబడ్డీ ఆటలో తలపడుతున్న బాలికలు

క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని.

\- సిడాం తుక్కరాణి



మాది ఆదిలాబాద్. ఇంద్రవెల్లిలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఎనిమిదో తరగతి నుంచి కబడ్డీ ఆడుతున్నా. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. ఉత్తమ డిఫెండర్‌గా, రైడర్‌గా పురస్కారం అందుకున్నా. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పసిడి పతకం సాధించాలని, క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నా.

ప్రో-కబడ్డీలో ఆడాలని..: ఆర్.అనూషా



మాది తలమడుగు మండలం సుంకిడి గ్రామం. అక్కడే జడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. పీడీ నాందేవ్ శిక్షణలో మంచి రైడర్‌గా ప్రావీణ్యం పొందా. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని, ప్రో-కబడ్డీ పోటీల్లో ఆడాలని ఉంది. పాఠశాల సెలవు అనంతరం రోజూ రెండు గంటలు సాధన చేస్తున్నా.

సైన్యంలో చేరాలని..: టేకం అంజలి



మాది రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామం. ఇచ్చోడలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో పదో తరగతి చదువుతున్నా. మూడేళ్లుగా కబడ్డీ ఆట ఆడుతున్నా. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. సైన్యంలో చేరాలన్న తన చిన్నప్పటి కలను సాకారం చేసేందుకు కబడ్డీ కోర్టులో తీవ్రంగా శ్రమిస్తున్నా. ఆ ఆటలోని మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నా.

పోలీసు కావాలని..

\- బి.సోనాలి



మాది ఇంద్రవెల్లి. ఆదిలాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. నిజామాబాద్, గజ్వేల్, సూర్యాపేట, హనుమకొండ, మంచిర్యాల ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. బిహార్, రాజస్థాన్, ఝార్ఖండ్ వేదికల్లో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఒకసారి ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. క్రీడా విభాగంలో పోలీసు కావాలనే లక్ష్యంతో తీవ్రంగా సాధన చేస్తున్నా.

బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి బాధ్యతల స్వీకరణ



ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపకులపతి వెంకటరమణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇది వరకు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పని చేసిన వెంకటరమణ, పరిపాలన విభాగం అధికారి రణధీర్‌లు స్వాగతం పలికారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చి పరిశీలిస్తానన్నారు.

ప్రమాదాల దారి.. పర్యవేక్షణ ఏది?

✷ తాజాగా ఈ నెల 6న జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రహదారిపైనే లారీని నిలిపారు. పొగమంచు కారణంగా లారీని పసిగట్టలేక ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆదిలాబాద్ శాంతినగర్ విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందటం విషాదానికి దారితీసింది.

రోడ్డుపై వాహనాలు నిలపరాదు. ఎన్‌హెచ్ అనుమతి లేకుండా రహదారిని ఆనుకొని దాబాలు నిర్వహించరాదు. అనుమతి ఉంటే రోడ్డుకు ఆనుకొని 10 మీటర్ల స్థలం వదిలేసి ప్రవేశం(ఎంట్రీ), నిష్క్రమణ(ఎగ్జిట్) మార్గాలుండాలనే నిబంధనలు అమలుకాక ప్రమాదాలకు దారితీస్తోంది.

● ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే మేలు

ఈటీవీ - ఆదిలాబాద్ : నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఐఏ) విభాగం నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ - నిర్మల్ మధ్య ఉన్న 44వ నెంబరు జాతీయ రహదారి రక్తమోడుతోంది. నిర్మల్ కేంద్రంగా ఉండే ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) కార్యాలయం కరోనా సమయంలో కామారెడ్డికి మారింది. అప్పటి నుంచి నిర్మల్ జిల్లా సోన్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డొల్లార వరకున్న 115 కి.మీ. రహదారి నిర్వహణపై ఆ శాఖ పర్యవేక్షణ లేకుండాపోయింది.



నిర్మల్ జిల్లా గంజాల్, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ దగ్గర ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలు ద్వారా ఎన్‌హెచ్ విభాగం డబ్బులు వసూలు చేయటానికి అనుమతిచ్చిందే తప్పితే ప్రమాదాలకు కారణాలపై దృష్టి పెట్టడం లేదు. నిర్మల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని మూడు టోల్ ప్లాజాల ద్వారా సగటున రోజుకు 10 వేల వాహనాల రాకపోకలు జరుగుతాయనేది అంచనా. ఒక్కో ప్లాజాకు రూ.40 లక్షల చొప్పున మూడింటి ద్వారా రూ.1.20 కోట్లు వాహనదారులు చెల్లించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం టోల్ వసూళ్లకు అనుమతిస్తున్న అధికారులు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవటం రహదారి నిర్వహణను చూసే గుత్తేదారులకు కలిసొస్తోంది.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నేరడిగొండ టోల్ ప్లాజా దగ్గర రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉన్న దృశ్యమిది. గంజాల్, పిప్పర్‌వాడ సహా రోడ్డును ఆనుకొని ఉన్న ప్రతి దాబా దగ్గర ఇదే పరిస్థితి. కొన్ని దాబాల్లోనైతే మద్యం తాగి, భోజనాలు చేస్తున్నా ఎన్‌హెచ్, పోలీసు, ఆబ్కారీ శాఖాధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ ఏడాది జనవరి 8న మావల బైపాస్ దగ్గర అపసవ్య దిశలో వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో ఆదిలాబాద్‌కు చెందిన అఖిలేష్(29) మృతి చెందారు.



చేయాల్సిందేమిటి?

✷ ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆబ్కారీ అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అన్వేషించాలి.

✷ కామారెడ్డి ఎన్‌హెచ్ పీడీకి అనుబంధంగా ఆదిలాబాద్, నిర్మల్ కేంద్రాలుగా డివిజన్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి.

✷ దాబాల్లో మద్యం, గంజాయి వినియోగాన్ని అరికట్టాలి.

✷ 25 కి.మీ.లకు ఒక అంబులెన్సును అందుబాటులో ఉంచాలి.

✷ 2012లో చేసిన సర్వేలో గుర్తించిన 53 ప్రమాద పాయింట్లలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది వెల్లడించాలి.

✷ గుడిహత్నూర్-జందాపూర్, గిమ్మ బైపాస్ దగ్గర వంతెనలు సహా రెండు వైపులా సర్వీసు రోడ్లు అందుబాటులోకి తేవాలి.

☛ గత నెల 30న అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి దగ్గర జరిగిన ప్రమాదంలో మహ్మద్ ఉస్మాన్ ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ, సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్, మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మృతి చెందారు. వీరంతా ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందినవారు.

ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నస్పూర్, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్ రమేష్, క్రీడా సమాఖ్య కార్యదర్శులు ఫణిరాజా, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన క్రైస్తవులు

అందరూ దైవ సమానులే: మంత్రి సీతక్క



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, న్యూస్‌టుడే: కులమతాల మధ్య భేదాలు సృష్టించుకోవద్దని, అందరూ దైవ సమానులే అని మంత్రి సీతక్క అన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెంలోని కల్వారి చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్ష ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దాదాపు లక్ష పైచిలుకు క్రైస్తవ భక్తులతో సభ ప్రాంగణం నిండిపోయింది. ప్రపంచ శాంతి కోసం ఏటా 50 రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతున్నట్లు పాస్టర్ ప్రవీణ్ చెప్పారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఈ ఉపవాస దీక్షతో తమ ప్రాంతం దేశం మొత్తం తెలిసిందన్నారు. ప్రపంచ స్థాయిలో కల్వారి ఇంతలా పేరు సాధించడం సంతోష కారణమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, రవికుమార్, నాతరి స్వామి, రాంచందర్ తదితరులున్నారు.